క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కందుకూరు: మండలంలోని పులిమామిడిలో గల 33కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ధన్నారం ఫీడర్ పరిధిలో చెట్లకొమ్మలు తొలగించుట, ఏబీ స్విచ్ అమర్చుతున్న కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ వేణుగోపాల్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు తిరిగి సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు ధన్నారం, మురళీనగర్, చిప్పలపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని, రైతులు, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



కార్మికులతో సమావేశమైన సీఐటీయూ నాయకులు

కందుకూరు: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ బుడ్డీరపు శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని ఆకులమైలారంలో భవన నిర్మాణ కార్మికులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్మికులు తమ శ్రమతో పెద్ద పెద్ద భవనాలు నిర్మిస్తారని, కాగా వారు ఉండటానికి ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం వారికి ఉండటానికి స్థలం చూపి.. ఇల్లు నిర్మించాలని, లేబర్ కార్డులు జారీ చేసి అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. అనంతరం లేబర్ కార్డుల కోసం కార్మికులతో దరఖాస్తు చేయించారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు సత్తయ్య, కార్యదర్శి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్‌దారుల సభను విజయవంతం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న రవిమాదిగ

మహేశ్వరం: కందుకూరులో ఈ నెల 8వ తేదీన జరుగనున్న పెన్షన్‌దారుల సన్నాహక సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మహేశ్వరం మండల ఇన్‌చార్జి బక్కని రవిమాదిగ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం మండల పరిధిలోని గట్టుపల్లి, కల్వకోల్ గ్రామాల్లో గ్రామ పంచాయతీ ఆవరణల వద్ద పెన్షన్‌దారుల చైతన్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం దివ్యాంగులకు పెన్షన్ రూ.6వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఎర్ర గణేశ్‌మాదిగ, నాయకులు ఎర్ర నవీన్‌మాదిగ, మహేందర్‌మాదిగ, పెంజర్ల నర్సింహ, శివరాజ్‌గౌడ్, బక్కని సత్తయ్య, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

బ్రోచర్ ఆవిష్కరణ


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

సైదాబాద్: అశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి ప్రారంభమయ్యే దేవీ శరన్నవరాత్రి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని సైదాబాద్ మాతా మైదాన్‌లో కొలువుదీరిన శ్రీవిజయదుర్గా మాతా ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఆదివారం ఆలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు ఉత్సవాల బ్రోచర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 22 నుంచి ప్రారంభమయ్యే దేవీ శరన్నవరాత్రి వేడుకలు విజయదశమి రోజు అక్టోబర్ 2న ముగుస్తాయన్నారు. అమ్మవారు ప్రతిరోజు ప్రత్యేక అలంకరణతో భక్తులకు దర్శనమిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో హరిదేశాయ్, అశోక్‌కుమార్, సునీల్‌రెడ్డి, శ్రవణ్‌కుమార్, యాదగిరిగౌడ్ పాల్గొన్నారు.

ఎక్స్‌గ్రేషియా పెంచడం హర్షణీయం

మలక్‌పేట: నిర్మాణ రంగ కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే ఇచ్చే ఎక్స్‌గ్రేషియా రూ.6 నుంచి రూ.10 లక్షల వరకు పెంచడం హర్షణీయమని జాతీయ భవన నిర్మాణ కార్మికుల సేవా సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బ్యాగరి అనంతయ్య అన్నారు. ఆదివారం ఆయన మలక్‌పేటలో మాట్లాడుతూ.. సహజ మరణానికి రూ. 2లక్షల వరకు పెంచడం శుభపరిణామని, సంఘం పోరాట ఫలితమే ఈ పెంపుదల అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు డబుల్ బెడ్రూమ్ ఇవ్వాలని, వారి పిల్లలకు స్కాలర్‌షిప్స్ కల్పించాలన్నారు.


పహాడీషరీఫ్: శ్రీరాంకాలనీలో రూ.1.11లక్షలకు లడ్డూ దక్కించుకున్న మౌనిక


మహేశ్వరం: మన్సాన్‌పల్లిలో రూ.3.55లక్షలకు లడ్డూ దక్కించుకున్న రాజుయాదవ్

గంగమ్మ ఒడికి.. గణనాథులు

గణేశ్ నిమజ్జనోత్సవం శనివారం రాత్రి మహేశ్వరం నియోజకవర్గంలో కనుల పండువగా జరిగింది. నవరాత్రులు పూజలందుకున్న గణనాథుల నిమజ్జనానికి నిర్వాహకులు భారీ ఎత్తున ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆయా మండపాల వద్ద నిర్వహించిన లడ్డూ వేలం పాటలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. బ్యాండు మేళాలు, సంప్రదాయ నృత్యాల మధ్య ఉండ్రాలయ్యను గంగమ్మ ఒడికి సాగ నంపారు. గణపతి బప్పా మోరియా .. అంటూ భక్తులు హోరెత్తిన నినాదాలతో గణపయ్యకు ఘనమైన వీడ్కోలు పలికారు.


కందుకూరు: అన్నోజిగూడలో రూ.1.45లక్షలకు లడ్డూ దక్కించుకున్న కాకి దరశరథముదిరాజ్


బడంగ్‌పేట్: గాయత్రీహిల్స్‌లో రూ.25,116లకు స్టార్ యూత్ లడ్డూ కైవసం చేసుకున్న ఈశ్వరోజు లిఖిత్‌చారి


కందుకూరు: నేదునూరులో రూ.88 వేలకు లడ్డూ దక్కించుకున్న ఎండీ అఫ్జల్‌బేగ్


మీర్‌పేట: నందిహిల్స్‌లో రూ.3.71 లక్షలకు లడ్డూ దక్కించుకున్న సాయికుమార్


మీర్‌పేట: టీఎస్‌ఆర్‌నగర్‌లో రూ.2.01 లక్షలకు లడ్డూ దక్కించుకున్న శ్రీరామచంద్రమూర్తి


మీర్‌పేట: నందిహిల్స్‌లో రూ.77 వేలకు లడ్డూ దక్కించుకున్న నల్లా వెంకటేశ్వర్

నాలాల్లో మట్టిని తొలగించిన హైడ్రా

సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిన అధికారులు

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజలు, వాహనాదారులు పడుతున్న ఇబ్బందులను తొలగించి శాశ్వత పరిష్కారాలు చూపించడం జరిగిందని ఎస్ఎఫ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. ఆదివారం ఆరాంఘర్ రైల్వే బ్రిడ్జి ప్రాంతంలో నాలాల్లో పేరుకుపోయిన మట్టి తొలగింపు పనులను తొలగించే పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆరాంఘర్ చౌరస్తా రైల్వే బ్రిడ్జి కింద మేజర్ వాటర్ గోయింట్ పాయింట్ కింద కొన్ని సంవత్సరాలుగా నాలాలలో పూర్తిగా మట్టి పేరుకుపోవడం కారణంగా అండర్ పాస్ రైల్వే బ్రిడ్జి కింద చిన్నపాటి వర్షానికి కూడా వాహనదారులు ఇబ్బందులు పడుతుండే వారన్నారు. దీంతో గత నెల హైడ్రా కమిషనర్ రంగనాథ్, హైడ్రా అడిషనల్ డైరెక్టర్ పాపయ్య, ఏడీఎఫ్‌వో యజ్ఞ నారాయణ, ఎస్ఎఫ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి ఆరాంఘర్ రైల్వే బ్రిడ్జిని పరిశీలించి మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీం హైడ్రా బృందాలను ఏర్పాటు చేశారన్నారు. నాలాలలో పేరుకుపోయిన మట్టిని పూర్తిగా తొలగించడం జరిగిందన్నారు. వర్షం వస్తే వాహనాదారులకు ఇబ్బంది కలగకుండా శాశ్వత మార్గం మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీం హైడ్రా నిరంతరం పర్యవేక్షిస్తూ ఇక్కడ పరిస్థితులు ఆరా తీశారన్నారు. నాలాలో పేరుకుపోయిన మట్టిని తొలగించాలని ఆదేశించారన్నారు. గత నెలలో ఐదు సెంటీమీటర్లు వర్షానికి ట్రాఫిక్ జామ్ భారీగా ఏర్పడింది, మొన్న 10 సెంటీమీటర్ల వర్షం పడినా కానీ ఎటువంటి ఇబ్బంది కలగకుండా మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీం హైడ్రా వాహనాదారులకు, క్లియర్ చేశారు. హైడ్రా మార్షల్ రాములు, సూపర్‌వైజర్ల బృందంతో రాజేంద్రనగర్, శాస్త్రీపురం, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌ల టీమ్స్ కలిసి కొన్ని సంవత్సరాలుగా నాలాలలో పేరుకుపోయిన మట్టిని తొలగిస్తూ ప్రజలకు మోక్షం కలిగేలాగా చేశారు. మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్ హైడ్రా రాజేంద్రనగర్ సర్కిల్ నిరంతరం పర్యవేక్షిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


నాలాల్లో మట్టిని తొలగిస్తున్న సిబ్బంది

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు టమాటా రూ.23, వంకాయ రూ.35, బెండ రూ.40, పచ్చిమిర్చి రూ.35, కాకరకాయ రూ.27, బీరకాయ రూ.41, కాలిఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.15, క్యారెట్ రూ.40, దొండ రూ.45, ఆలుగడ్డ రూ.23, ఉల్లిగడ్డ రూ.24, గోకరకాయ రూ.35, దోసకాయ రూ.15, సొరకాయ రూ.15, పొట్లకాయ రూ.23, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.45, చామగడ్డ రూ.23, మునగ రూ.45, కందగడ్డ రూ.40, బీట్‌రూట్ రూ.25, కీర రూ.15, బీన్స్ రూ.55, క్యాప్సికమ్ రూ.53. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

అందరి సహకారంతో ఉత్సవాలు విజయవంతం

- అధికారుల సహకారం అభినందనీయం
- భాగ్యనగర్ గణేశ్ సమితి ప్రధాన కార్యదర్శి శ్రీధర్



రాజేంద్రనగర్: అందరి సహకారంతోనే గణేశ్ నవరాత్రి ఉత్సవాలు విజయవంతమయ్యాయని... నిమజ్జన శోభాయాత్ర ప్రశాంతంగా పూర్తయిందని భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నెల రోజులకు పైగా ఏర్పాట్ల కోసం శ్రమించిన జీహెచ్ఎంసీ, ఎలక్ట్రికల్, పోలీసు, ట్రాఫిక్, ఆర్అండ్‌బీ, వాటర్స్ వర్క్స్, హెల్త్, ఐఅండ్‌పీఆర్, శానిటేషన్ తదితర అన్ని విభాగాల అధికారులు, సిబ్బందికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. సర్కిల్ పరిధిలో గణేశ్ ఉత్సవాలను ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా నిర్వహించడంలో అధికారులు చూపిన చొరవ మరువలేనిదన్నారు. ఈ మేరకు అన్ని శాఖల అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. పత్తికుంట, పల్లె చెరువు వంటి ప్రధాన చెరువులతో పాటు ఇతర ప్రాంతాలలో నిమజ్జన ఏర్పాట్లను అధికారులు నిర్వహించడంలో సఫలీకృతం అయ్యారన్నారు. సర్కిల్ జల మండలి, విద్యుత్, రెవెన్యూ, పోలీసు వంటి ప్రధాన శాఖలతో ఇతర అధికారులు సైతం పూర్తి సహకారం అందించారన్నారు.

ప్లాస్టిక్ పరిశ్రమలో అగ్నిప్రమాదం

మైలార్‌దేవ్‌పల్లి: షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ పరిశ్రమలో ఆదివారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. వివరాలివీ... మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ టాటానగర్‌లో పెట్ బాటిల్ అండ్ స్క్రాప్ మెటీరియల్స్ పరిశ్రమ ఉంది. రోజూ మాదిరిగానే శనివారం రాత్రి కంపెనీని మూసి కార్మికులు వెళ్లిపోయారు. ఆదివారం మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు చెలరేగి దట్టమైన పొగ వ్యాపించింది. స్థానికులు విషయాన్ని రాజేంద్రనగర్ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో స్టేషన్ ఆఫీసర్ చంద్రనాయక్ నేతృత్వంలో సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగి ఉండవచ్చని అధికారులు వెల్లడించారు. ప్రమాద సమయంలో కార్మికులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

సమస్యలు పరిష్కరించాలంటూ వినతి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న ముచ్చర్ల వాసులు

కందుకూరు: తమ గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల పరిధిలోని ముచ్చర్ల వాసులు ఆదివారం ఎమ్మెల్యే సబితారెడ్డిని ఆమె నివాసంలో కలిసి కోరారు. ముచ్చర్ల నుంచి పోతుబండతండా వరకు రహదారి నిర్మించాలని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఆమెకు వినతి పత్రం అందించారు. దీనిపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే రహదారి నిర్మాణానికి రూ.2.72 కోట్లు మంజూరయ్యా యని, టెండర్ ప్రక్రియ పూర్తయిన వెంటనే త్వరలో పనులు ప్రారంభమవుతాయని వారికి తెలిపారు. కార్యక్రమంలో డేరంగుల మోహన్, డేరంగుల శ్రీనివాస్, బండ నర్సింహ, వరికుప్పల శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

రావినారాయణరెడ్డికి నివాళి


చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

మీర్‌పేట: పీడిత వర్గాలకు భూమితో పాటు మొత్తం ఆస్తిని దానం చేసిన గొప్ప నాయకుడు రావి నారాయణరెడ్డి అని సీపీఐ బాలాపూర్ మండల కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం రావి నారాయణరెడ్డి 34వ వర్ధంతి సందర్భంగా లెనిన్ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజా ఉద్యమానికి రావి నారాయణరెడ్డి తన జీవితాన్ని అంకితం చేయడంతో పాటు నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేశారని కొనియాడారు. ఆయన సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల సహాయ కార్యదర్శి రెడ్యానాయక్, గిరిజన సమైక్య మండల కార్యదర్శి శత్రునాయక్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

బండ్లగూడ: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రేనా క్లినిక్ గైనకాలజిస్ట్ డాక్టర్ ఎలిజబెత్ మండేలా అన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 18వ డివిజన్ ఆనంద్‌నగర్‌లో కొత్తగా నెలకొల్పిన రేనా క్లినిక్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. క్యుసిడి ల్యాబ్స్ అధినేత రవీందర్‌గౌడ్, ల్యాబ్ టెక్నిషియన్లు రమేష్, అల్దమస్, సునీల్, సంగీత, పూజలు ఆనంద్‌నగర్, ధాత్రి కాలనీ వాసులు రక్త పరీక్ష, మధుమేహం, థైరాయిడ్ వంటి ఆరోగ్య పరీక్షలు చేశారు. గైనకాలజిస్ట్ డాక్టర్ ఎలిజబెత్ మండేలా రోగులను పరీక్షించి తగు చికిత్స చేశారు. ఆనంద్‌నగర్ కాలనీ వాసులతో పాటు ధాత్రి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.శివరామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కొండా ఆనందరెడ్డి, వి.భాస్కర్ రెడ్డి, గాజుల చంద్రశేఖర్, కె.చంద్రశేఖరరెడ్డి, సీనియర్ సిటిజన్లు కొంపెల్ల కామేశ్వరరావు, ఎస్.రామలింగం, ఉలిగేశ్వర్, టి.శంకర్, ప్రసాద్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


ఆలయ ద్వారబంధనం చేస్తున్న అర్చకులు

ఆలయాల మూసివేత


దేవాలయానికి తాళం వేస్తున్న సిబ్బంది

చాదర్‌ఘాట్: చంద్రగహణం సందర్భంగా ఓల్డ్‌మలక్‌పేటలోని పోచమ్మ దేవాలయాన్ని ఆదివారం మూసివేశారు. సోమవారం ఉదయం దేవాలయ సంప్రోక్షణ (శుద్ధి) అనంతరం భక్తులకు ప్రవేశం, దర్శనం కల్పిస్తామని ఆలయ పూజారి వెల్లడించారు.

కర్మన్‌ఘాట్‌లో..

చంపాపేట: చంద్రగ్రహణ ప్రభావంతో ఆదివారం చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామివారి ఆలయ ద్వారబంధనం చేశారు. ముందుగా ఆలయ అర్చకులు స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, నివేదనలు జరిపిన అనంతరం ఉదయం 11 గంటలకు ఆలయాన్ని మూసివేశారు. సోమవారం ఉదయం సంప్రోక్షన, అభిషేకాల అనంతరం భక్తులకు స్వామివారి దర్శనాలు, ప్రత్యేక పూజలు ఉంటాయని ఈఓ లావణ్య స్పష్టం చేశారు.

ట్రాఫిక్ చిక్కులు.. నిత్యం తిప్పలు

విస్తరణకు నోచుకోని జాతీయ రహదారి

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు, ట్రాఫిక్ పోలీసులు



దిల్‌సుఖ్‌నగర్: రహదారులు విస్తరణకు నోచుకోకపోవడంతో వాహనదారులకు శాపంగా మారుతోంది. పగలు రాత్రీ తేడా లేకుండా గంటల తరబడి ట్రాఫిక్ జామ్‌తో నిత్యం నరకవ చవిచూస్తున్నామని వాహనచోదకులు వాపోతున్నారు. ఉద్యోగాలు, వివిధ పనుల కోసం ఉదయం బయలుదేరినా ట్రాఫిక్ జామ్‌తో సరైన సమయానికి చేరుకోలేక పోతున్నామని సాయంత్రం కూడా ఇదే పరిస్థితి ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు. విద్యార్థులు సైతం సరైన సమయానికి చేరుకోలేక పోతున్నామని వాపోతున్నారు.

ప్రధాన చౌరస్తాలో నరకమే..

దిల్‌సుఖ్‌నగర్, కొత్తపేట, మూసారంబాగ్, మలక్‌పేట్, నల్గొండ క్రాస్‌రోడ్డు, సైదాబాద్, చాదర్‌ఘాట్‌లో నిత్యం వాహనదారులు, పాదచారులు నరకం అనుభవిస్తున్నారు. ప్రతిరోజు రద్దీగా ఉండి వాహనదారులతో కిటకిటలాడే దిల్‌సుఖ్‌నగర్‌లోని జాతీయ రహదారిపై ట్రాఫిక్‌ను అదుపు చేయడంలో ట్రాఫిక్ పోలీసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దిల్‌సుఖ్‌నగర్, మలక్‌పేట్, సరూర్‌నగర్ పరిధిలోని ప్రధాన చౌరస్తాలలో ప్రతి నిత్యం ట్రాఫిక్ ఉదయం సాయంత్రం వేళల్లో అంతరాయం కలుగుతుంది.

కానరాని ట్రాఫిక్ పోలీసులు

అయితే ట్రాఫిక్ పోలీసులు కాస్త చొరవ తీసుకుంటే ఎంతోకొంత ట్రాఫిక్ జామ్‌ను నియంత్రించ వచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి పెట్టాల్సింది పోయి కేవలం చలాన్‌లపైనే దృష్టి సారిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చే వాహనాలు, తోపుడు బండ్ల వారి నుంచి ముక్కు పిండి డబ్బులు వసూలు చేస్తున్నారు. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగించే షాపింగ్‌మాల్స్, వైన్స్ షాపులు, బార్ అండ్ రెస్టారెంట్, ఫంక్షన్‌హాళ్లు, కల్లు కాంపౌండ్, లారీ అడ్డాల ముందు అక్రమ పార్కింగ్ చేసినా అటువైపు ట్రాఫిక్ పోలీసులు కన్నెత్తి చూడటం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆక్రమణల్లో జాతీయ రహదారి..

జాతీయ రహదారిపై ప్రయాణం ట్రాఫిక్ అడుగడుగునా అడ్డంకులను సృష్టిస్తోంది. రోజురోజుకు జాతీయ రహదారి ఆక్రమణకు గురవుతోంది. దిల్‌సుఖ్‌నగర్, కొత్తపేట్, ఎల్‌బీనగర్‌లో జాతీయ రహదారిపైనే అక్రమ వ్యాపారాలు, అక్రవు పార్కింగ్‌తో ట్రాఫిక్ సమస్యల తలెత్తుతోంది. దీనికితోడు రోడ్లు విస్తరణకు నోచుకోకపోవడం ప్రధాన సమస్య. పది నిమిషాల్లో చేరుకోవాల్సిన గమ్యాన్ని రెండు గంటలైనా చేరుకోలేకపోతున్నారంటే నగరంలో ట్రాఫిక్ ఏ మేరకు ఉందో అర్థం చేసుకోవచ్చు. ఉదయం, సాయంత్రం వేళలో ఈ ససమస్య జఠిలంగా మారుతోంది. ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డు నుంచి చాదర్‌ఘాట్ వరకు ట్రాఫిక్ జామ్ లేని రోజే ఉండదని వాహనదారులు పేర్కొంటున్నారు.

ఇలా చేస్తే కాస్త ఊరట

- అవసరమైన ప్రాంతాల్లో రోడ్డు విస్తరణ చేపట్టాలి.
- రద్దీ ప్రాంతాల్లో ప్రధాన కూడళ్లల్లో ట్రాఫిక్ సిబ్బందిని నియమించి వాహనాలను నియంత్రించాలి.
- 7 సీటర్ ఆటోలను రద్దీ సవుయంలో ఎల్‌బీనగర్‌కు రాకుండా నిషేధించాలి.
- సర్వీస్ రోడ్లపై అక్రవు పార్కింగ్‌లను తొలగించి చిన్న వాహనాలను ఈ దారివైపు మళ్లించాలి.
- ప్రధాన చౌరస్తాలో ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేసేలా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలి.